శేరిలింగంపల్లి అభివృద్ధికి రూ.1,606 కోట్లు

- హెచ్‌–సిటీ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- మూడు ఫ్లైఓవర్లు, రోడ్డు విస్తరణ, 6లేన్‌ బై డైరెక్షనల్‌ ఫ్లైఓవర్‌, అండర్‌ పాస్‌లు
- హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌ రైజింగ్‌ ఉత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి నగరంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంపై పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే గాంధీ హర్షం వ్యక్తం చేశారు. హెచ్‌–సిటీలో భాగంగా శేరిలింగంపల్లిలో రూ.1,606 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సీఎం సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతామన్నారు. శేరిలింగంపల్లిలోని ఖాజాగూడ జంక్షన్‌, ట్రిపుల్‌ఐటీ జంక్షన్‌, విప్రో జంక్షన్‌లలో మల్టీలెవల్‌ ఫ్లైఓవర్‌/గ్రేడ్‌ సరెటర్స్‌ 3 జంక్షన్లలో రూ.837 కోట్లతో పనులు చేపడతారు. రూ.39 కోట్లతో గచ్చిబౌలిలోని సీపీ సైబరాబాద్‌ కార్యాలయం నుంచి గచ్చిబౌలి జంక్షన్‌ వరకు 215 అడుగుల రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. రూ.31 కోట్లతో అంజయ్యనగర్‌ నుంచి రాంకీ టవర్‌ వరకు 150 అడుగుల మేర రోడ్డు విస్తరణ అలాగే రూ.45 కోట్ల రూపాయలతో ఎన్‌హెచ్‌–65 నుంచి అమీన్‌పూర్‌ వరకు 150/100 అడుగు రోడ్డు విస్తరణ జరుగుతుందన్నారు. రూ.530 కోట్లతో మియాపూర్‌ చౌరస్తా– ఆల్విన్‌ చౌరస్తా వరకు ఆరు లైన్ల బై డైరెక్షన్‌ ఫ్లైఓవర్‌ , లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వరకు మూడులేన్ల యూని డైరెక్షనల్‌ అండర్‌పాస్‌ నిర్మాణం చేస్తారని ఆయన వివరించారు. కాగా రూ.124 కోట్లతో శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్‌ వద్ద ఆర్‌ఓబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ప్రశాంతంగా నేషనల్‌ అచీవ్‌మెంట్‌ సర్వే పరీక్షలు

శేరిలింగంపల్లిలో 14 కేంద్రాలు


గోపన్‌పల్లి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి, హెచ్‌ఎం తాజ్‌బాబు తదితరులు

రాయదుర్గం: దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్‌ అచీవ్‌మెంట్‌ సర్వే (ఎన్‌ఏఎస్‌) పరీక్షలు శేరిలింగంపల్లిలో బుధవారం ప్రశాంతంగా సాగాయి. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలలో 3, 6, 9 తరగతుల విద్యార్థుల ప్రగతిని అంచనా వేసి రాష్ట్రాలకు ర్యాంకింగ్‌ను అందించడానికి ఈ పరీక్షలను నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా శేరిలింగంపల్లి మండల పరిధిలో 14 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. ఎన్‌ఏఎస్‌ రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మీ పర్యవేక్షణలో మండల విద్యాధికారి వెంకటయ్య, రాయదుర్గం స్కూల్‌ కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే తాజ్‌బాబు పరిశీలించారు. ఎంపీపీఎస్‌ కేశవనగర్‌ పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గోపన్‌పల్లితండా, ఎంపీపీఎస్‌ సిద్ధిఖ్‌నగర్‌లోని పాఠశాలల్లో పరీక్ష నిర్వహణను పరిశీలించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌


సుభాష్‌చంద్రబోస్‌ కాలనీలో బాధితులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ శ్రీకాంత్‌

మియాపూర్‌: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ హామీ ఇచ్చారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్‌ కాలనీలో అగ్ని ప్రమాద ఘటనలో కాలిపోయిన గుడిసెలను కార్పొరేటర్‌ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా అందే సహాయ సహకారాలు త్వరితగతిన అందేలా చూస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సంతోష్‌కుమార్‌, కొండల్‌, లక్ష్మయ్య, రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్‌ ఉచిత శిక్షణ ప్రారంభం


కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు, ఫౌండేషన్‌ సీఎండీ సుబ్బారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆలయ చైర్మన్‌ కుమారస్వామి సహకారంతో సీల్‌వెల్‌ ఫౌండేషన్‌ సీఎండీ సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్‌ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణను బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్‌ మండడి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా టైలరింగ్‌ శిక్షణను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి 125 కుట్టు మిషన్లు మహిళలకు ఉచితంగా అందజేయనున్నారని తెలిపారు. తన వంతుగా 25 మందికి కుట్టు మిషన్లు అందజేస్తానన్నారు. గత సంవత్సరం 5 వేల మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో బాబూరావు, రాజేష్‌ రాయ్‌, ఉప్పల చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామపంచాయతీ ఆవరణలో ఆర్కే ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీపీ రవీందర్‌ గౌడ్‌, మాజీ గ్రామ సర్పంచ్‌ పులిగిల్ల ప్రకాశంచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌వీఎం ఆసుపత్రి వైద్య బృందం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌ చైర్మన్‌ దండే రమాకాంత్‌ మాట్లాడుతూ... శిబిరంలో దాదాపు 250 మంది రోగులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు.

నిరుపయోగంగా..


కమ్యూనిటీహాల్‌కు తాళం వేసిన దృశ్యం

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధి హుడా కాలనీలోని కమ్యూనిటీహాల్‌ భవనం నిరుపయోగంగా ఉంది. ప్రభుత్వ కార్యక్రమాలకు లక్షల నిధులతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను పట్టించుకోకపోవడంతో పాడుబడ్డ బంగ్లాలా మారిపోయింది. కమ్యూనిటీహాల్‌ పరిసరాలు చెత్త చెదారంతో నిండిపోయాయి. హాల్‌లో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. ప్రధాన గేటు ముందు వాహనాలు పార్కింగ్‌ చేస్తున్నారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఈ హాల్‌ను శుభ కార్యక్రమాలకు కాలనీవాసులు వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. కమ్యూనిటీహాల్‌ను వినియోగంలో తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.


హుడాకాలనీలోని కమ్యూనిటీ హాల్‌


ఆవరణలో చెత్త


వాహనాల పార్కింగ్‌


దోవా కాలనీలో కుంగిన మ్యాన్‌హోల్‌


న్యూ కాలనీలో..


లక్ష్మీనగర్‌ కాలనీలో..

మ్యాన్‌హోళ్లు.. అస్తవ్యస్తం.. ప్రమాదాలు

పలుచోట్ల కుంగుబాటు.. పగుళ్లు

- మూతలు లేవు.. వాహనదారుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మియాపూర్‌: మియాపూర్‌ డివిజన్‌ పరిధిలో ప్రధానరోడ్లపై మూతలు లేని మ్యాన్‌హోల్స్‌ ప్రమాదకరంగా మారాయి. పలుచోట్ల కుంగడంతో బాటు ధ్వంసమై, మూతలు లేకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొరపాటున ఈ మ్యాన్‌హోళ్లను గమనించకపోతే వాహనదారులు ప్రమాదాల బారిన పడినట్టే..

- మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని న్యూకాలనీ, లక్ష్మీనగర్‌ కాలనీ, ఆదిత్యనగర్‌, దోవా కాలనీ, కృషినగర్‌, ఓల్డ్‌ మియాపూర్‌, ఎస్‌బీఐ కాలనీ.. ఇలా పలు కాలనీలలో మ్యాన్‌హోళ్లు కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. కొన్నిచోట్ల మూతలు లోపలకు పోగా మరికొన్ని చోట్ల పాడయ్యాయి. దీంతో రాత్రిపూట రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించే డ్రైనేజీ, మ్యాన్‌హోళ్ల మూతలు ధ్వంసమైపోతున్నాయని, ప్రతిఏటా మ్యాన్‌హోళ్ల మరమ్మతుల కోసం లక్షల రూపాయలు ఖర్చుచేస్తున్నా సమస్య శాశ్వత పరిష్కారం కావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుండా పోతోందని కాలనీవాసులు విమర్శిస్తున్నారు.
- మియాపూర్‌ కృషినగర్‌ ప్రధాన రహదారిలో 20రోజుల కిందట సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే సమయంలో మ్యాన్‌హోళ్ల మరమ్మతులు చేశారు. ఆ తర్వాత సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ప్రస్తుతం వాహనాల రాకపోకలతో మ్యాన్‌హోళ్ల మూతలు ధ్వంసమయ్యాయి.
- అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆదిత్యనగర్‌ కాలనీలో..

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర శాఖ నిర్ణయం ప్రకారం గురువారం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు గురువారం ఉదయం 10 గంటలకు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, డివిజన్‌ అధ్యక్షులు, డివిజన్‌ పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు.

స్వయం సహాయక సంఘాలకు చెక్కులు అందజేత


చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం రుణాలు ఇస్తోందని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని స్వయం సహాయక సంఘాలకు 50 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మున్సిపల్‌ పాలకవర్గ సభ్యులు, అధికారులు, పొదుపు సంఘాల మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ రోజా బాల్‌ రెడ్డి, కమిషనర్‌ మంగతాయారు ,ఆర్‌ఓ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిళ్లు పంపిణీ


దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేసిన కార్పొరేటర్‌ పుష్పన గేష్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్‌ చైర్లు, ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ పుష్పనగేష్‌ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజాసమస్యలను పరిష్కరిస్తున్నామని తెల్లాపూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌ సంగారెడ్డి అన్నారు. బుధవారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తెల్లాపూర్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం అమలుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మున్సిపాలిటీలో ఈనెల 9వ తేదీ వరకు ప్రజాపాలన విజయోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ విజయోత్సవాలలో ప్రజలు భాగస్వాములవ్వాలని కోరారు.

కాలనీ అభివృద్ధికి సహకరించండి


కాలనీ అధ్యక్షులు షేక్‌ ఖాసీంను సన్మానించిన ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: గుల్‌మొహర్‌ పార్కు కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే గాంధీని కాలనీ అసోసియేషన్‌ ప్రతినిధులు కోరారు. బుధవారం ఆయన నివాసంలో కలసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో సీసీ రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, వరద నీటి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో ఉత్తమ పార్కు అవార్డు సాధించిన గుల్‌మొహర్‌ పార్కు కాలనీ అధ్యక్షులు షేక్‌ ఖాసీంను ఎమ్మెల్యే సన్మానించి, అసోసియేషన్‌ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కుమార్‌, ఉపాధ్యక్షులు మోహన్‌రావు, ప్రభాకరాచారి, జాయింట్‌ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ప్రతినిధులు విల్సన్‌, సత్యనారాయణ, కిరణ్‌, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, కృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని సాయినగర్‌ వెస్ట్‌ కాలనీకి చెందిన లక్ష్మణ్‌గౌడ్‌ నివాసంలో బుధవారం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమీన్‌పూర్‌ పురపాలక సంఘం వైస్‌ చైర్మన్‌ నందారం నరసింహగౌడ్‌ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములకు అన్నసమారాధన నిర్వహించి సన్మానించారు.

గణేష్‌గడ్డ గణనాథునికి ప్రత్యేక పూజలు



పటాన్‌చెరు టౌన్‌: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్‌ గడ్డ దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ లావణ్య మాట్లాడుతూ...ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారికి ప్రత్యేక పూజలు , హోమం నిర్వహించినట్లు తెలిపారు. పూజా కార్యక్రమంలో జూనియర్‌ అసిస్టెంట్‌ ఈశ్వర్‌, ఆలయ అర్చకులు సంతోష్‌ జోషి, జగదీశ్వర్‌స్వామి, చంద్రశేఖర్‌, అయ్యప్ప, సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆరుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమాన, అదేవిధంగా ముగ్గురికి రూ.1500, మరో వ్యక్తికి వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

స్ట్రీట్‌ కార్నర్‌ మీటింగ్‌ను విజయవంతం చేయండి

పటాన్‌చెరు: స్ట్రీట్‌ కార్నర్‌ మీటింగ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ డివిజన్‌ అధ్యక్షుడు నరేష్‌ ముదిరాజ్‌ పిలుపునిచ్చారు.బుధవారం పటాన్‌చెరు డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలుచేయకుండా ప్రజలను మోసం చేసిందని ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాలలో స్ట్రీట్‌ కార్నర్‌ సమావేశాలకు పిలుపునిచ్చారన్నారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో సమావేశం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

స్వల్పంగా కంపించిన భూమి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్‌ డివిజన్‌, తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో భూమి స్వల్పంగా కంపించడంతో స్థానికులు ఆందోళన చెందారు.ఆ సమయంలో వంట గదిలోని సామానుల కదిలాయని పలువురు తెలిపారు. కొందరు తాము కూర్చున్న సోఫాలు కదిలినట్టుగా అనిపించాయని తెలిపారు. భూమి కంపించిందని తెలుసుకొని ఆందోళన చెందారు.

8న ‘టెడెక్స్‌’ హైదరాబాద్‌ సమావేశం

గచ్చిబౌలి: టెడెక్స్‌ 10వ ఎడిషన్‌ సమావేశాలను సొసైటీ ఫర్‌ అడ్వాన్స్‌మెంట్‌ ఆఫ్‌ హ్యూమన్‌ ఎండీవర్‌ (ఎస్‌ఏహెచ్‌ఈ) ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో నిర్వహిస్తారు. ఈ సమావేశాలలో ప్రసంగించేందుకు 14 మంది ప్రముఖులను ఎంపిక చేశారు. అత్యధిక ప్రయాణాలు చేసిన వ్యక్తి రవి ప్రభు, ట్యాంక్‌బండ్‌లో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన అనేక మంది ప్రాణాలను రక్షించిన ట్యాంక్‌బండ్‌ శివ, నిర్మాతనాగ్‌ అశ్విన్‌, ప్రఖ్యాత ఏరోస్పేస్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ ప్రహ్లాద రామారావు, వివిధ రంగాలలో ప్రముఖులైన ఎన్‌డీటీవీ ఎగ్జిక్యూటివ్‌ ఎడిటర్‌ ఉమాసుధీర్‌, ప్రముఖ ఆర్కియాలజిస్ట్‌, చరిత్రకారుడు డాక్టర్‌ ఈ శివనాగిరెడ్డి, మయూర్‌ పట్నాల, చెఫ్‌ సంజయ్‌తుమ్మా, అజీజ్‌ నాజర్‌, మస్త్‌ అలీ, అయోధ్యరామిరెడ్డి, రుబీనా నఫీస్‌, ఫాతిమా, డాక్టర్‌ శివ, కవితా పాలంచ, శిఖాగోయల్‌ వంటి ప్రముఖులు ప్రసంగిస్తారు.

ఘనంగా మహా పడిపూజ


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్‌: మియాపూర్‌లోని లోహియా కన్వెన్షన్‌ హాల్‌లో చేగూరి సాయికుమార్‌గౌడ్‌ గురుస్వామి ఆధ్వర్యంలో 18వ మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప నామ స్మరణతో, భజనలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ లక్ష్మీనారాయణగౌడ్‌, నాయకులు గౌతమ్‌గౌడ్‌, శ్రీనివాస్‌ యాదవ్‌, కరుణాకర్‌గౌడ్‌, ప్రసాద్‌, ఓం ప్రకాష్‌, కృష్ణ, నాగులుగౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, మల్లేష్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యకాన్‌ అవార్డుల పంపిణీ

గచ్చిబౌలి: మాదాపూర్‌ మైండ్‌స్పేస్‌లోని వెస్టిన్‌ హోటల్‌లో గురువారం సూర్యకాన్‌ హైదరాబాద్‌–2024 పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఈక్యూఎంఏజీ సీఈఓ ఆనంద్‌గుప్తా తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ వార్షిక సోలార్‌ అవార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌పీడీసీఎల్‌ హైదరాబాద్‌ చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ చిలుకమారి చక్రపాణి, ఆదాయపుపన్ను శాఖ హైదరాబాద్‌ అదనపు కమిషనర్‌ యాదగిరి, సీఈఓ మాజీ సభ్యుడు జి వీర, సింగరేణి కాలరీస్‌ జనరల్‌ మేనేజర్‌ జీఎస్‌ జానకిరామ్‌, తెలంగాణ స్టేట్‌ రెన్యూవబుల్‌ ఎనర్జీ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ వైస్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఎన్‌ జానియా పాల్గొంటారని వివరించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ఉషాముళ్లపూడి ప్రధాన రహదారి ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి త్వరలోనే నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్‌, సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్‌ పాల్గొన్నారు.